సాక్షి రంగారెడ్డి

బుధవారం । 1 । మే । 2024



మామిడి మార్కెట్‌లో ఉద్రిక్తత

వినియోగదారుల హక్కుల సంస్థ పేరుతో కొంతమంది బాటసింగారంలోని మామిడి మార్కెట్‌లో హల్‌చల్ చేశారు. 8లో▸



బాలాపూర్ చౌరస్తాలో ముఖ్యమంత్రి రోడ్‌షోకు హాజరైన జనం

న్యూస్‌రీల్

పౌష్టికాహారంపై మహిళలకు అవగాహన కల్పించండి

స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ప్రాంతీయ రీజినల్ డైరెక్టర్ మోతి



అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న మోతి

కడ్తాల్: పౌష్టికాహార ప్రాధాన్యతపై ఐసీడీఎస్ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు మహిళలు గర్భిణులు, బాలింతలు, తల్లులకు అవగాహన కల్పించాలని స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రాంతీయ (హైదరాబాద్) రీజినల్ డైరెక్టర్ మోతి సూచించారు. మండల కేంద్రంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను మంగళవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా అంగన్‌వాడీ కేంద్రాల రికార్డులను పరిశీలించి, ఐసీడీఎస్, అంగన్‌వాడీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. పిల్లల్లో పౌష్టికాహార లోపం, గర్భిణులు, పాలిచ్చే తల్లుల్లో రక్తహీనత గురించి, సమగ్ర సర్వే ద్వారా వివరాలు సేకరించాలని అన్నారు. పిల్లల్లో ఎదుగుదల, బరువు విషయంలో చిన్నారుల తల్లిదండ్రులకు తగిన సూచనలు చేయాలని తెలిపారు. అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, సూపర్‌వైజర్లు విధి నిర్వహణలో అలసత్వానికి తావివ్వొద్దని హెచ్చరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో రోజా, సూపర్‌వైజర్ శబరి, అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి



ఫర్టిలైజర్ షాపులో రికార్డుల పరిశీలన

మొయినాబాద్: ఫర్టిలైజర్ షాపుల్లో డీలర్లు ఎరువులను ఎంఆర్‌పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి హెచ్చరించారు. మొయినాబాద్‌లోని పలు ఫర్టిలైజర్ షాపులను మంగళవారం ఆమె తనిఖీ చేశారు. ఈ పాస్ మిషన్లు, స్టాక్ రిజిస్టర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డీలర్ల ఎరువులు విక్రయించిన వెంటనే ఈ పాస్ మిషన్‌లో అప్‌డేట్ చేయాలన్నారు. యూరియా, డీఏపీ ఎరువులను అన్ని షాపుల్లో అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు కొనుగోలు చేసే రైతులు తప్పనిసరి బిల్లులు తీసుకోవాలన్నారు. అంతకు ముందు రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా మొయినాబాద్ రైతు వేదికలో వీడియోకాన్ఫరెన్స్‌ను డీఏఓ గీతారెడ్డి పర్యవేక్షించారు. వేసవిలో కూరగాయల సాగు పై శాస్త్రవేత్తలు ఇచ్చిన సూచనలు, సలహాలను రైతులు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి రాగమ్మ, ఏఈఓలు కుమార్, సునీల్ ఉన్నారు.

బాలికలదే హవా



పది ఫలితాల్లో రాష్ట్రంలో 24వ స్థానంలో జిల్లా

10/10 జీపీఏ

- 2023తో పోలిస్తే 4.4 శాతం పెరిగిన ఉత్తీర్ణత
- సత్తా చాటిన ప్రభుత్వ, కేజీబీవీ విద్యార్థులు
- 50 మందికి 10/10 జీపీఏ మార్కులు
- జూన్ 3 నుంచి 13 వరకు సప్లిమెంటరీ పరీక్షలు

ఒగ్గు జోత్స్న, సాయి మనోజ్ఞ, ఆకుల వంశీవర్ధన్, తాళ్లపల్లి కీర్తన, పి.ప్రణవి, కె.కీర్తన, కె.మణిదీప్‌చారి, శశాంక్, సుమిత్‌సింగ్, ఎం.భావన, ఎం.వరుణ్, జక్క మేఘన

వంద శాతం 'సర్కారు' సత్తా

జిల్లా వ్యాప్తంగా 268 ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించిన విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా, వీటిలో 25 ప్రభుత్వ పాఠశాలలు వందశాతం ఉత్తీర్ణత సాధించాయి. వీటిలో అబ్దుల్లాపూర్‌మెట్, బండరావిర్యాల, ఆకుతోటపల్లి, పోచారం, నాగన్‌పల్లి, ఎక్వాయ్‌పల్లి, ముద్విన్, చారికొండ, కొల్‌కుల్‌పల్లి, అందుగుల, కొంగరరావిర్యాల, అమీర్‌పేట్, పెరికిరాల తండా, సరూర్‌నగర్, రేగడిదోస్వాడ, టంగుటూరు, పడ్కల్, చుక్కాపూర్, చంద్రదన, రాంపూర్, ఖానాపూర్, వెల్జాల, కడ్తాల్ కేజీబీవీ, కొందుర్గు కేజీబీవీ, షాబాద్‌లోని కస్తూర్బా బాలికల విద్యాలయాలు ఉన్నాయి. అత్యల్పంగా తోల్‌కట్టలో 48.65 శాతం, ఇబ్రహీంపట్నం జెడ్పీ బాలికల హైస్కూల్ (యుఎం) లో 42.86 శాతం, వేములనర్వలో40 శాతం, షాబాద్ బాలుర పాఠశాలలో 38.37 శాతం మాత్రమే ఉత్తీర్ణత నమోదైంది.

సాక్షి, రంగారెడ్డిజిల్లా: పదో తరగతి ఫలితాల్లో ఎప్పటిలాగే ఈ సారి కూడా బాలికలే పైచేయి సాధించారు. జిల్లాలో మొత్తం 50,811 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా, వీరిలో 46,245 మంది ఉత్తీర్ణత (91.01) సాధించారు. ఇక 26,446 మంది బాలురు పరీక్షకు హాజరు కాగా, వీరిలో 23,508 మంది (88.89 శాతం) ఉత్తీర్ణులయ్యారు. 24,365 మంది బాలికలు పరీక్షకు హాజరు కాగా, వీరిలో 22,737 మంది ఉత్తీర్ణత (93.32 శాతం) సాధించారు. 2023 ఫలితాలతో పోలిస్తే ఈసారి 4.4 శాతం అధికంగా సాధించడం గమనార్హం. రాష్ట్రంలోని ఇతర జిల్లాలతో పోలిస్తే.. ఉత్తీర్ణత శాతంలో జిల్లా 24వ స్థానంలో నిలవడం ఆందోళన కలిగిస్తోంది. రీకౌంటింగ్, రీ వెరిఫికేషన్ కోసం ఈ నెల 3 నుంచి 17 వరకు ఎల్బీనగర్ బహదుర్‌గూడ ప్రభుత్వ పాఠశాలల్లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఒక్కో సబ్జెక్టుకు రూ.1000 చలానా చెల్లించాల్సి ఉంటుంది. వార్షిక పరీక్షల్లో తప్పిన విద్యార్థుల కోసం జూన్ 3 నుంచి 13 వరకు ప్రతి రోజు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నారు. మే 16 లోపు పరీక్ష ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.

50 మందికి 10/10 జీపీఏ

కేజీబీవీ, ప్రభుత్వ, గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులు కార్పొరేట్, ప్రైవేటు స్కూళ్లకు ఏమాత్రం తీసిపోలేదు. జిల్లాలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 50 మంది విద్యార్థులు 10/10 జీపీఏ సాధించారు. వీరిలో దినసరి కూలీలు, ఆటో డ్రైవర్ల పిల్లలు ఉండడం విశేషం. 10/10 జీపీఏ సాధించిన వారిలో ఎం.శశాంక్(ఇబ్రహీంపట్నం ప్రభుత్వ పాఠశాల), టి.సాయి మనోజ్ఞ (చేవెళ్ల టీఎస్ మోడల్‌స్కూల్), ఒగ్గు జోత్స్న (చేవెళ్ల టీఎస్ మోడల్ స్కూల్), పి.ప్రణవి (టీఎస్ మోడల్ స్కూలు, నేదునూరు), కన్నమోని కీర్తన(టీఎస్ మోడల్ స్కూలు, నేదునూరు), వి.ప్రవళిక (టీఎస్ మోడల్ స్కూలు పాలమాకుల), దొడ్ల హర్షిత (టీఎస్ మోడల్ స్కూలు పాలమాకుల), అమూల్య (జెడ్పీహెచ్‌ఎస్, కర్మన్‌ఘాట్), మహ్మద్ నజియా ఖాతున్ (జెడ్పీహెచ్‌ఎస్, సరూర్‌నగర్), తాళ్లపల్లి కీర్తన(జెడ్పీహెచ్‌ఎస్, జిల్లెలగూడ), కాంబోజి మణిదీప్ చారి (జెడ్పీహెచ్‌ఎస్, కొంగరకలాన్), జక్క మేఘన (జెడ్పీహెచ్‌ఎస్, బాటసింగారం), ఆకుల వంశీవర్ధన్ (జెడ్పీహెచ్‌ఎస్, జిల్లెలగూడ), డి.రామచంద్రవర్మ (జెడ్పీహెచ్, మణికొండ), సుమిత్ సింగ్(జెడ్పీహెచ్‌ఎస్, నందిగామ), పట్నం భావన (జెడ్పీహెచ్‌ఎస్, రాయపోల్) ఎం.వరుణ్ (సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల, కొందుర్గు) ఉన్నారు.

గత ఆరేళ్లలో ఉత్తీర్ణత శాతం

సంవత్సరం	విద్యార్థులు	ఉత్తీర్ణత	శాతం
2024	50,811	46,245	91.01
2023	47,702	41,488	86.97
2022	47,157	42,460	90.04
2019	45,747	42,467	92.83
2018	43,392	37,809	87.13
2017	42,706	36,164	84.68
2016	90,607	74,360	82.09

రోడ్‌షో.. జోష్

- బాలాపూర్ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి కార్నర్ మీటింగ్
- పెద్ద సంఖ్యలో హాజరైన కార్యకర్తలు, నాయకులు, అభిమానులు
- కాంగ్రెస్ కేడర్‌లో జోష్ నింపిన ముఖ్యమంత్రి ప్రసంగం



ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డిని గెలిపించాలని కోరుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

మీర్‌పేట: లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం రాత్రి మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ చౌరస్తాలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్వహించిన రోడ్‌షో కాంగ్రెస్ కేడర్‌లో జోష్ నింపింది. రాత్రి 8.05 గంటలకు బాలాపూర్ చౌరస్తాలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో సీఎం ప్రజలు, కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. కార్యకర్తలు, నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. 8.40 గంటలకు ముఖ్యమంత్రి రోడ్‌షో బాలాపూర్ చౌరస్తా నుంచి కర్మన్‌ఘాట్, ఎల్బీనగర్ మీదుగా ఆర్‌కేపురం బయలుదేరి వెళ్లింది. సీఎం వెంట చేవెళ్ల అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి, సీఎం సలహాదారు వేంరెడ్డి నరేందర్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల లోక్‌సభ ఇన్‌చార్జిలు నేరెళ్ల శారద, నిజాముద్దీన్, కేఎల్లార్, బడంగ్‌పేట మేయర్ చిగురింత పారిజాత, సామిడి గోపాల్‌రెడ్డి, చల్లా బాల్‌రెడ్డి, సిద్దాల శ్రీశైలం ఉన్నారు.

'కొండా' ఒక టూరిస్ట్

బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఒక టూరిస్ట్ అని.. తాను బాధ్యత గల ప్రజా సేవకుడినని కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి వ్యాఖ్యలు చేశారు. బద్ధకస్తుడికి, ఐదేళ్లకోసారి ఒక టూరిస్టులా వచ్చే విశ్వేశ్వర్‌రెడ్డికి, నిత్యం ప్రజల మధ్యే ఉండే తనకు ఉన్న తేడా ఇదేనన్నారు. కోవిడ్ కష్టకాలంలోనూ విశ్వేశ్వర్‌రెడ్డి శానిటైజర్ పూసుకుని ఇంట్లోనే ఉన్నారు తప్ప ఎక్కడా కనిపించలేదని, తాను గ్రామగ్రామాన తిరిగి ప్రజలకు అండగా నిలిచానని చెప్పారు. విశ్వేశ్వర్ రెడ్డి అబద్ధాల కోరు అని, వస్తాడు వెళ్తాడు తప్ప ప్రజల బాగోగులు ఏనాడూ పట్టించుకోలేదని ఆరోపించారు. మోదీ పేరు చెబితే ఓట్లు పడవని, ప్రజాసేవ చేసే వారికే ప్రజల మద్దతు ఉంటుందన్నారు. అపాయింట్‌మెంట్ అడిగే కొండాకు ఈ ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పి కాంగ్రెస్‌కు ఓటు వేసి దీవించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలను తప్పకుండా అమలు చేస్తామని, రూ.500 సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అర్హులైన అందరికీ ఇస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉచిత బస్సు, కరెంటు ఇస్తే బీజేపీ వారు బాధలు పెంచుతున్నారని విమర్శించారు. బీజేపీకి ఓటు వేస్తే సంక్షేమ పథకాలు, రిజర్వేషన్లు తీసేస్తామంటున్నారని, ప్రజలంతా ఆలోచించి సంక్షేమం కోరుకునే కాంగ్రెస్‌కు ఓటు వేయాలని పిలుపునిచ్చారు.

వాహనదారుల పాట్లు

ముఖ్యమంత్రి రోడ్‌షో సందర్భంగా ఎయిర్‌పోర్టుకు వెళ్లే ప్రధాన ఆర్‌సీఐ రహదారిని మూసివేశారు. సాయంత్రం వేళ కావడంతో అటు ఎయిర్‌పోర్ట్, ఇటు బడంగ్‌పేట మీదుగా ఆదిబట్లకు వెళ్లే వాహనదారులు ఇబ్బంది పడ్డారు. మంత్రాల చెరువు మీదుగా మీర్‌పేట, అల్మాస్‌గూడ నుంచి చుట్టూ తిరిగి గమ్యస్థానాలకు వెళ్లాల్సి వచ్చింది.

చేవెళ్లలో ఎగిరేది బీఆర్‌ఎస్ జెండానే

మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సబితారెడ్డి

చేవెళ్ల: మూడోసారి చేవెళ్ల గడ్డపై బీఆర్‌ఎస్ జెండా ఎగురుతుందని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి అన్నారు. శంకర్‌పల్లి మండలం చందిప్పలో మంగళవారం శంకర్‌పల్లి మున్సిపల్, మండల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ రాజకీయంగా అవకాశం కల్పించి పదవులిస్తే పార్టీకి వెన్నుపోటు పొడిచి వెళ్లిపోయిన రంజిత్‌రెడ్డిని ఈ ఎన్నికల్లో ఓడించాలని పిలుపునిచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి చేవెళ్ల గడ్డపై ఎన్నిసార్లు ప్రచారం చేసిన కాంగ్రెస్ పార్టీ ఓడిపోవడం ఖాయమన్నారు. కాసాని జ్ఞానేశ్వర్ గెలిచి తీరుతారని ధీమా వ్యక్తం చేశారు. ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పదేళ్ల పాలన ప్రజలకు తెలుసని అన్నారు. కేసీఆర్ లాంటి నాయకుడు తనను నమ్మి ఎంపీ టికెట్ కేటాయించడం సంతోషకరమని, ఆయన నమ్మకాన్ని నిలబెట్టుకునేలా కార్యకర్తలు, నాయకులు కష్టపడి పనిచేయాలన్నారు. ఎమ్మెల్యే కాలె యాదయ్య మాట్లాడుతూ.. భూ కబ్జాదారులే పార్టీ నుంచి వెళ్లిపోయారని, అలాంటి వారికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. శాసన మండలి మాజీ చైర్మన్‌స్వామి గౌడ్ మాట్లాడుతూ.. పార్టీలకు అతీతంగా బీసీలంతా ఏకమై జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను గెలిపించుకొని సత్తా చాటాలన్నారు. సమావేశంలో ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు గోపాల్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పాపారావు, మాజీ వైస్ చైర్మన్ వెంకటేశ్, సొసైటీ చైర్మన్ బద్దం శశిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆస్పత్రి వద్ద ఉద్రిక్తత

యాచారం: మాల్ కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రి వద్ద మంగళవారం ఉద్రిక్తత చోటుచేసుకుంది. కడ్తాల్ మండలం సరికొండకు చెందిన గౌర పాపయ్య(50) పది రోజుల క్రితం పురుగు మందు తాగి ఆతహత్యాయత్నం చేశాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు మాల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి సోమవారం రాత్రి మృతి చెందాడు. దీంతో వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యంతోనే మృతి చెందాడని కుటుంబ సభ్యులు, బంధువులు ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. పాపయ్య మృతికి ఆస్పత్రి యాజమాన్యమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న యాచారం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతుడి కుటుంబ సభ్యులకు నచ్చజెప్పారు. దీంతో ఆందోళనను విరమించారు.

బీజేపీలోకి ఏడుగురు కార్పొరేటర్లు

- కో ఆప్షన్ మెంబర్‌తో కలిసి కమలం పార్టీలోకి..



కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరిన మీర్‌పేట కార్పొరేషన్‌కు చెందిన కాంగ్రెస్, బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు

మీర్‌పేట: లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన ఏడుగురు కార్పొరేటర్లు, ఓ కోఆప్షన్ సభ్యురాలు కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలకు షాక్ ఇచ్చారు. కాంగ్రెస్‌కు చెందిన కార్పొరేటర్లు వేముల నర్సింహ, మల్లేశ్ ముదిరాజ్, జిల్లెల అరుణ, కో ఆప్షన్ సభ్యురాలు వేముల ఎల్లమ్మ, బీఆర్‌ఎస్ నుంచి ఇంద్రావత్ రవినాయక్, విజయలక్ష్మి, గౌరీశంకర్, ధరంకార్ జ్యోతి మంగళవారం చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి మీర్‌పేట పర్యటనకు వచ్చే రోజునే స్థానిక కార్పొరేటర్లు పార్టీని వీడి బీజేపీలో చేరడం చర్చనీయాంశంగా మారింది.

గౌరవం ఇవ్వకపోవడంతోనే..

బీజేపీలో చేరిన అనంతరం కార్పొరేటర్లు మీర్‌పేటలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందే అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరామని, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే స్థానిక బడా నాయకులు తమకు కనీస గౌరవం ఇవ్వకపోవడం, అహంకార పూరితంగా వ్యవహరిస్తూ అవమాన పర్చడంతోనే పార్టీ మారుతున్నట్లు వెల్లడించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో సబితారెడ్డి విజయానికి కృషి చేశామని, కొంత కాలంగా పార్టీ కార్యక్రమాలకు తమకు ఆహ్వానం లేకపోవడం.. దూరంగా పెట్టారన్న కారణంతోనే పార్టీని వీడామని బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు తెలిపారు. ప్రధాని మోదీ చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై బీజేపీలో చేరామన్నారు. ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించుకుంటామని స్పష్టంచేశారు. సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొలన్ శంకర్‌రెడ్డి, మీర్‌పేట అధ్యక్షుడు పెండ్యాల నర్సింహ, ప్రధాన కార్యదర్శులు గాజుల మధు, సోమేశ్వర్, సూల ప్రభాకర్, నీలా రవినాయక్ తదితరులు ఉన్నారు.

సబ్సిడీ బియ్యం సకాలంలో పంపిణీ చేయాలి



మాట్లాడుతున్న చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

ఆమనగల్లు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చౌక ధరల దుకాణాల ద్వారా అందజేస్తున్న సబ్సిడీ బియ్యాన్ని ప్రజలకు సకాలంలో పంపిణీ చేయాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి కోరారు. ప్రజలందరికీ నాణ్యమైన ఆహారం అందించాలన్నదే కమిషన్ ధ్యేయమన్నారు. మంగళవారం ఆయన పట్టణంలో పలు రేషన్ దుకాణాలు, హోటల్స్‌ను తనిఖీ చేశారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ.. ప్రభుత్వాలు అందించే సబ్సిడీ బియ్యం సకాలంలో లబ్ధిదారులకు అందించేందుకు సంబంధిత అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. రేషన్ సరుకులు పక్కదారి పట్టకుండా పౌరసరఫరాల శాఖ ద్వారా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని వివరించారు. ఆహార పదార్థాల విక్రయాల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు వెంకట్‌రెడ్డి, దశరథ్‌నాయక్, చంద్రశేఖర్‌రెడ్డి, జహంగీర్, ప్రసాద్, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

మామిడి మార్కెట్‌లో ఉద్రిక్తత

- వినియోగదారుల హక్కుల సంస్థ పేరుతో పలువురి హల్‌చల్
- వ్యాపారులు, రైతులు అడ్డుకోవడంతో గొడవ
- 15మంది ముఠా సభ్యులను పోలీస్ స్టేషన్‌కు తరలింపు



వివరాలు తెలుసుకుంటున్న మార్కెట్ కార్యదర్శి నర్సింహారెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్: వినియోగదారుల హక్కుల సంస్థ పేరుతో కొంతమంది ముఠా సభ్యులు మంగళవారం అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బాటసింగారంలోని మామిడి మార్కెట్‌లో హల్‌చల్ చేశారు. మామిడి ప్యాకింగ్ చేస్తున్న కూలీలతో పాటు రైతులు, వ్యాపారులపై దౌర్జన్యానికి దిగడంతో కొద్ది సేపు ఉద్రిక్తత నెలకొంది. మార్కెట్ శాఖ అధికారుల సమాచారంతో పోలీసులు జోక్యం చేసుకుని ముఠా సభ్యులను పీఎస్‌కు తరలించారు. దాదాపు మూడు గంటలకుపైగా కొనసాగిన వివాదానికి సంబంధించి రైతులు, వ్యాపారులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మంగళవారం మధ్యాహ్నం సుమారు 15 మంది వచ్చి మామిడి యార్డులో ప్యాకింగ్ చేస్తున్న కూలీలను అడ్డుకుని ప్యాకింగ్ చేసిన మామిడిపండ్లను తొలగించి చూపించాలని బెదిరింపులకు పాల్పడ్డారు. అక్కడున్న వారంతా ఎవరి పనుల్లో వారు నిమగ్నమైన ఉన్న సమయంలో హంగామా సృష్టిస్తుండడంతో రైతులు, వ్యాపారులంతా అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో ఘర్షణ వాతావరణం చోటుచేసుకోగా పలువురికి గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న మార్కెట్ కార్యదర్శి నర్సింహారెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని సముదాయించే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. అక్కడకు చేరుకున్న పోలీసు సిబ్బంది ముఠా సభ్యులను అదుపులోకి తీసుకుని మార్కెట్ కమిటీ కార్యాలయంలో విచారించగా.. తాము వినియోగదారులు హక్కుల సంస్థ సభ్యులమని, మామిడి ప్యాకింగ్‌లో రసాయనాలు వాడుతున్నారన్న సమాచారంతో వచ్చామని చెప్పారు. ఇందుకు సంబంధించిన ఆధారాలు చూపాలని ప్రశ్నించడంతో పొంతన లేని సమాధానాలు చెప్పారు. వ్యాపారులపై దాడులకు పాల్పడ్డారని, రైతుల పనులకు విఘాతం కలిగించారని మార్కెట్ కమిటీ ఫిర్యాదుతో ముఠా సభ్యులను అబ్దుల్లాపూర్‌మెట్ పీఎస్‌కు తరలించారు. రసాయనాలు వాడుతున్నారనే విషయమై తెలుసుకునేందుకు ఎవరైనా ముందస్తు సమాచారం ఇస్తే ప్రతీ ప్యాకింగ్‌ను తనిఖీ చేయిస్తామని మార్కెట్ కార్యదర్శి నర్సింహారెడ్డి తెలిపారు. అలా కాకుండా మార్కెట్‌లోకి ప్రవేశించి దాడులకు పాల్పడటం సరి కాదని తెలిపారు.



మోదీ పాలనలో దేశం అధోగతి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాలమల్లేశ్

చేవెళ్ల: పదేళ్ల మోదీ పాలనలో దేశం అధోగతి పాలయిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్. బాలమల్లేశ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.రామస్వామి అధ్యక్షతన అంబేడ్కర్ భవన్‌లో చేవెళ్ల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన బాలమల్లేశ్ మాట్లాడుతూ.. మోదీ పదేళ్లలో ఉద్యోగాలు ఇవ్వకపోగా ఉన్న ఉద్యోగాలకు ఎసరుపెట్టారని విమర్శించారు. నల్లధనం తెచ్చి పేదలకు పంచుతామని ప్రగల్భాలు పలికి నిత్యావసర ధరలు పెంచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ, బీఆర్‌ఎస్‌లు జతకట్టి ప్రజల ఆకాంక్షలను నిర్వీర్యం చేస్తున్నాయని మండిపడ్డారు. సీపీఐ జిల్లా కార్యదర్శి జంగయ్య మాట్లాడుతూ.. బీజేపీ ప్రతిపక్షాలపై కేసులు బనాయించి ఓట్లు రాబట్టేందుకు యత్నిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వికారాబాద్ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మీపండిట్, జిల్లా నాయకులు ప్రభులింగం, నర్సింగ్‌రావు, గోపాల్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, దత్తునాయక్, చందునాయక్, సత్యనారాయణ, పార్టీ మండలకార్యదర్శి సత్తిరెడ్డి, మక్బుల్, సుధీర్, శ్రీనివాస్, జంగయ్య, బాబురావు, మంజుల, శివయ్య, యాదగిరి, శివ, ఆనందం పాల్గొన్నారు.

బీజేపీతోనే రైతు సంక్షేమం

- చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



రైతు సమ్మేళనంలో మాట్లాడుతున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

చేవెళ్ల: దేశంలో బీజేపీ ప్రభుత్వంతోనే రైతు సంక్షేమం సాధ్యమని ఆ పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. మండలకేంద్రంలో మంగళవారం కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో చేవెళ్ల లోక్‌సభ స్థాయిలో రైతు సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికి కిసాన్‌మోర్చా రాష్ట్ర నాయకులు జంగయ్యగౌడ్, మారుతీ కిరణ్, అంజయ్య యాదవ్, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి, పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంజన్‌కుమార్, కంజర్ల ప్రకాశ్, ప్రేమ్‌రాజ్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతుల సంక్షేమం, అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. రైతులను ధనికులను చేయాలనే ఆలోచనతో ప్రధాని మోదీ అనేక పథకాలు చేపట్టారని తెలిపారు. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి, కృషి సించాయ్ యోజన, ఫసల్‌బీమా యోజన వంటి పథకాలు ప్రవేశ పెట్టారని గుర్తు చేశారు. గతంలో రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఈ పథకాలను రైతులకు అందకుండా కుట్ర చేసిందని ఆరోపించారు. దేశంలో మరోసారి మోదీ ప్రభుత్వమే రావాలని అన్నివర్గాల ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. ఎన్నికల్లో తనను గెలిపిస్తే చేవెళ్లను మిల్లెట్స్ హబ్‌గా తీర్చిదిద్దుతానని అన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, నాయకులు జక్కా రవీందర్ రెడ్డి, సుదర్శన్, జి.వెంకట్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, జంగారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు పాండురంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ఫిర్యాదులకు గ్రీవెన్స్ సెల్

అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ వెంకటమాధవరావు



వెంకట మాధవరావు

షాద్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ఫిర్యాదుల కోసం ప్రత్యేక గ్రీవెన్స్ సెల్‌ను ఏర్పాటు చేసినట్లు అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్, షాద్‌నగర్ ఆర్డీఓ వెంకట మాధవరావు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ఓటర్లకు సందేహాలు, ఫిర్యాదుల కోసం గ్రీవెన్స్ సెల్‌కు 08548-250078 నంబర్‌కు ఫోన్ చేయాలని తెలిపారు.

నిబంధనలకు విరుద్ధంగా బ్లాస్టింగ్స్

- పోలీసుల అదుపులో ఏడుగురు నిర్వాహకులు
- భారీగా పేలుడు పదార్థాల స్వాధీనం

అబ్దుల్లాపూర్‌మెట్: నిబంధనలకు విరుద్ధంగా బ్లాస్టింగ్‌కు పాల్పడుతున్న ఏడుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.ఈ ఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని సద్దుపల్లి గ్రామ పరిధిలో కొంతమంది అక్రమంగా బ్లాస్టింగ్‌కు పాల్పడుతున్నట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. మంగళవారం ఉదయం 8గంటల ప్రాంతంలో ఎస్ఐ సునీల్ తన సిబ్బందితలో కలిసి ఘటనాస్థలికి చేరకున్నారు. అనుమతులు లేకుండా బ్లాస్టింగ్‌కు పాల్పడుతున్నట్లు గుర్తించి ఏడుగురు నిర్వాహకులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద 42 జిలెటిన్ స్టిక్స్, 27 డిటోనేటర్లు, ఒక మెగ్గర్‌బాక్స్, ఒక అమ్మీటర్, నాలుగు మ్యాన్ ప్యాక్స్‌లు, రెండు కంప్రెషర్లు, మూడు వైర్ బండిల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు కొనసాగుతోంది.

ఇసుక ట్రాక్టర్ సీజ్

కొందుర్గు: ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న ఓ ట్రాక్టర్‌ను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు జిల్లేడ్ చౌదరిగూడ పోలీసులు తెలిపారు. మంగళవారం పోలీసులు తెలిపిన ప్రకారం.. జిల్లేడ్ చౌదరిగూడ మండలంలోని రావిర్యాల వాగులో నుంచి ఇసుక ఫిల్టర్ చేసి అనుమతులు లేకుండా పరిసర గ్రామాలో విక్రయిస్తున్నారని సమాచారం అందింది. దీంతో అక్కడకు వెళ్లి ట్రాక్టర్‌ను సీజ్ చేసి యజమానిపై కేసు నమోద చేసినట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

చేవెళ్ల: కుక్కను తప్పించబోయి కారు అదుపుతప్పి బోల్తాపడిన ఘటనలో ముగ్గురు క్షతగాత్రులు చికిత్స పొందుతుండగా ఒకరు మృతి చెందారు. ఈ ఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. మెహదీపట్నంకు చెందిన మహ్మద్ అసీర్(32), అబ్దుల్‌ఖాన్, సైఫ్ కారులో నగరం నుంచి చేవెళ్ల వైపు ప్రయాణిస్తున్నారు. రాత్రి 10గంటల సమయంలో పామెన బస్‌స్టేజీ సమీపంలో దాబా వద్ద భోజనం చేసి నగరానికి తిరుగు ప్రయాణం అయ్యారు. కుక్క అడ్డుగా రావడంతో బ్రేక్ వేసేందుకు యత్నించడంతో కారు బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ముగ్గురికీ తీవ్ర గాయాలవ్వడంతో 108 అంబులెన్స్‌లో నగరంలోని ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుల్లో అసీర్ అనే వ్యక్తి మంగళవారం ఉదయం మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తి దుర్మరణం

కొందుర్గు: మోటర్ సైకిల్ అదుపు తప్పి వ్యక్తి మృతిచెందిన సంఘటన జిల్లేడ్ చౌదరిగూడ మండలం తూంపల్లి శివారులో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా దోమ మండలం ఐనాపూర్‌కు చెందిన చాకలి సుక్కయ్య(38) మంగళవారం కొందుర్గు మండలం లాలపేటలో బంధువుల ఇంట్లో జరిగిన విందుకు వచ్చాడు. సాయంత్రం జిల్లేడ్ చౌదరిగూడ మండలం వీరన్నపేటకు చెందిన తన తోడల్లుడు శ్రీనుతో కలిసి తిరిగి వెళ్తుండగా తూంపల్లి శివారులో బైక్ అదుపుతప్పి కిందపడ్డారు. ఈ సంఘటనలో సుక్కయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ విషయమై శ్రీను ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై సక్రమ్ తెలిపారు.

ప్రభుత్వ భూములను పరిరక్షించండి

మణికొండ: గండిపేట మండలకేంద్రంలోని ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని, వాటిని పరిరక్షించాలని గండిపేట మాజీ సర్పంచ్ అశోక్ ఆధ్వర్యంలో తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డికి మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు గోపాల గణేశ్, ప్రశాంత్ సర్వేనంబర్ 16లోని శ్మశాన వాటిక భూమిని పంచాయతీ లే అవుట్ ప్రకారం రోడ్డుగా చూపిన స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. దేవాదాయ, మసీదు భూములు కబ్జా చేస్తున్నారని పేర్కొన్నారు. సర్వే నంబర్ 64లో ప్లాటుగా చేసి ఇంటిని నిర్మిస్తున్నారని వాటిని కూల్చివేసి ప్రభుత్వ భూములను పరిరక్షించాలని లేకుంటే, రానున్న రోజుల్లో కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపడుతామని వారు హెచ్చరించారు.

పంట వ్యర్థాలతో భూసారం పెంపు

భారతీయ నూనె గింజల పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ సురేష్, సతీశ్‌కుమార్



సేంద్రియ ఎరువుల తయారీపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

షాబాద్: భూముల సారం తగ్గి పంటలు పండే శక్తి కోల్పోయే స్థితికి చేరిందని భారతీయ నూనె గింజల పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ జి.సురేశ్, డాక్టర్ సతీశ్‌కుమార్ అన్నారు. మంగళవారం తిర్మలాపూర్ గ్రామంలో భారతీయ నూనె గింజల పరిశోధనా స్థానం హైదరాబాద్, సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుగుణమాల రైతు ఉత్పత్తిదారుల సంఘంలోని రైతులను పంట అవశేషాలు కుళ్లింపు చేసి నేలలో కలిపే పద్ధతులు, సేంద్రియ ఎరువల వాడం, నేల ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్ట్ మేనేజర్ రత్నాకర్ మాట్లాడుతూ.. భూసార పరీక్షలు చేయించి సరైన పోషకాలు అందిచినట్లయితే అధిక దిగుబడి పొందవచ్చాన్నారు. ఈ కార్యక్రమంలో సుగుణమాల రైతు ఉత్పత్తి దారుల సంఘం డైరెక్టర్లు లింగం, భూపతిరాజు, అంజయ్య, పద్మారెడ్డి, కృష్ణయ్య, వెంకటయ్య, రాంచంద్రయ్య, నర్సింహారెడ్డి, సుభాన్‌రెడ్డి, రైతులు తదితరులున్నారు.

రంజిత్‌రెడ్డి ప్రజల మనిషి



ఆలూరులో ప్రచారం చేస్తున్న సీతారంజిత్ రెడ్డి

- ఆయన సతీమణి సీతారెడ్డి
- ఆలూరు, అంతారం గ్రామాల్లో ప్రచారం

చేవెళ్ల: రంజిత్‌రెడ్డి ప్రజల మనిషని.. ఆయన పార్టీలకతీతంగా చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధి కృషి చేశారని ఆయన సతీమణి సీతారెడ్డి అన్నారు. మంగళవారం ఆమె మండల పరిధిలోని ఆలూరు, అంతారం, వెంకన్నగూడ గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీతారెడ్డి మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ చేవెళ్ల అభ్యర్థిగా పోటీ చేస్తున్న రంజిత్‌రెడ్డిని గెలిపిస్తే ఆరు గ్యారంటీలను అమలు చేసేందుకు నిరంతరం మీ మధ్యే ఉంటారన్నారు. చేవెళ్ల అభివద్ధికి కేంద్రం నుంచి నిధులు తీసుకువస్తారన్నారు. మీరే ఆయనకు రాజకీయంగా అవకాశం కల్పించారని.. మరోసారి దీవిస్తే మీ అభ్యున్నతికి పని చేస్తారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎంతో నమ్మకంగా చేవెళ్ల నుంచి రంజిత్‌రెడ్డికి అవకాశం కల్పించారని ఆయన నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఎంపీ సీటును గెలిపించుకుందామన్నారు. ప్రతీ ఒక్కరు చేయి గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఆగిరెడ్డి, వెంకట్‌రెడ్డి, ప్రతాప్ రెడ్డి, శైలజ, సమత, సరిత, ప్రభాకర్, టేకుపల్లి శ్రీను, అనంతరాములు, నరేందర్‌చారి, రాంరెడ్డి, వెంకటేశ్‌బాబు, సుజాత, వీరేందర్‌రెడ్డి, రాములు, యాదిరెడ్డి, శ్రీశైలం, యాదమ్మ, గ్రామ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఆశీర్వదించండి.. ఆదర్శంగా తీర్చిదిద్దుతాడు

బంట్వారం: లోక్‌సభ ఎన్నికల్లో మా నాన్నను భారీ మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల అభ్యర్థి రంజిత్‌రెడ్డి తనయుడు సిద్ధార్థరెడ్డి కోరారు. మంగళవారం ఆయన కోట్‌పల్లి మండల పార్టీ అధ్యక్షుడు నర్సింగ్ నాయక్‌తో కలిసి కంకణాలపల్లి, మల్‌షెట్టిపల్లి తండాలో ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మతతత్వ పార్టీలను తరిమికొట్టి సెక్యూలర్ పార్టీ అయిన కాంగ్రెస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. మోదీ పదేళ్ల పాలనలో పేదలు నిరు పేదలయ్యారని ఆరోపించారు. బీజేపీ నాయకులకు ఓట్లు అడిగే అర్హత లేదన్నారు. హస్తం గుర్తుకు ఓటు వేసి మా నాన్నను గెలిపిస్తే చేవేళ్ల పార్లమెంట్ నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ కోట్‌పల్లి మండల అధ్యక్షుడు నర్సింగ్‌నాయక్, నాయకులు గిరిధర్, రాముని నాయక్, రమేష్‌నాయక్, రాజేందర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, తలారి రాజు తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి దారుణ హత్య

- మృతదేహాన్ని పెట్రోల్‌పోసి తగులపెట్టిన దుండగులు
- క్లూస్ టీంతో వివరాలు సేకరించిన ఏసీపీ రంగస్వామి, సీఐ శివప్రసాద్



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ వరప్రసాద్

కడ్తాల్: గుర్తు తెలియని వ్యక్తి దారుణహత్యకు గురయ్యాడు. ఈ ఘటన కడ్తాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మక్తమాదారం శివారులోని ఓ వెంచర్‌లో వెలుగు చూసింది. వివరాల ప్రకారం.. కడ్తాల్-షాద్‌నగర్ ప్రధాన రహదారి సమీపంలోని ఓ వెంచర్‌లో సోమవారం రాత్రి సుమారు 40-45 ఏళ్ల ఉన్న గుర్తు తెలియని వ్యక్తిని కొందరు దుండగులు దారుణంగా హత్య చేసి గుర్తుపట్టకుండా పెట్రోలు పోసి తగులబెట్టారు. మంగళవారం ఉదయం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనాస్థలికి చేరుకున్న షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి, సీఐ శివప్రసాద్, ఎస్ఐ వరప్రసాద్ పోలీసు సిబ్బందితో కలిసి వివరాలు సేకరించారు. క్లూస్ టీం సాయంతో మృతదేహాన్ని పరిశీలించారు. హత్య జరిగిన పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించి వివరాలు సేకరించారు. మృతుడి శరీరంపై బ్రౌన్ కలర్ ఎస్సా కంపనీకి చెందిన అండర్‌వేర్ ఉందని, కింది వరుస దంతాలు సందులు ఉన్నాయని పోలీసులు తెలిపారు. ఏదైన పోలీస్ స్టేషన్ పరిధిలో మిస్సింగ్ కేసు నమోదు అయితే 8333993536, 8712568298, 9493628100 నంబర్లకు సమాచారం అందించాలని కోరారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మక్తమాదారం గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజునాయక్ ఫిర్యాదు మేరకు పోలీసులకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.